జగన్ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శం

చంద్రబాబుకు పని తక్కువ పబ్లిసిటీ ఎక్కువ - వరప్రసాద్ రావుకు సంపూర్ణ సహకారం అందించండి

------ గూడూరు ప్రజలను కోరిన మంత్రి కాకాణి ------

విశాలాంధ్ర - గూడూరు : ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సమీపంలో నూతన రైతు బజార్ ను బుధవారం మంత్రి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.15కోట్ల రూపాయలతో గూడూరులో రైతు బజార్ ను నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇటు రైతులు ఆదాయం అటు ప్రజలకు తక్కువ ధరలకే తాజా కూరగాయలు లభిస్తాయన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన దేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. రైతు బజార్ లో మరికొన్ని వసతుల కోసం 50 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను చూసి ఇతర రాష్ట్రాల్లో కూడా వాటిని ఏర్పాటు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రం గ్లోబల్ అవార్డుకు ఎంపికైందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. పాలించే నాయకుడు మంచి ఆలోచన కలిగి ఉంటే ప్రకృతి కూడా సహకరిస్తుందన్నారు. గత నాలుగేళ్లుగా ఎటువంటి కరువు లేదని గుర్తు చేశారు. గత టిడిపి ప్రభుత్వంలో ప్రతి సంవత్సరం అనేక మండలాల రైతులు కరువుతో ఇబ్బందులు పడ్డారని, సాగునీరే కాకుండా చాలా ప్రాంతాల్లో తాగునీరు కూడా కరువైందన్నారు. చంద్రబాబుకు పని తక్కువ పబ్లిసిటీ ఎక్కువన్నారు. జగన్ పని ఎక్కువ చేసినా పబ్లిసిటీ ఉండదన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పూర్తో స్థాయిలో రైతుకు అందించేందుకు సిద్ధపడిన ఏకైక సీఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం 2014లో ఇచ్చిన హామీలు అమలు పరిచినవి, అలాగే వైసీపీ ప్రభుత్వం 2019లో ఇచ్చిన హామీలు ప్రజలు గమనించాలన్నారు. ప్రజలందరూ జగన్మోహన్‌రెడ్డికి తమ ఆశీర్వాదాలు అందించాలని కోరారు. ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ వస్తున్నామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రానికి కోటి 15 లక్షలు హాస్పిటల్ నూతన భవనానికి 22 కోట్లు అర్బన్ హెల్త్ సెంటర్ కూరగాయల మార్కెట్ కు నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఎమ్మెల్సీ మేరీగా మురళి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్య మంత్రి ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారన్నారు. రైతులందరూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఎక్కడా లేనివిధంగా గూడూరులో రైతు బజార్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ దేవసేనమ్మ, ఏఎంసీ చైర్మన్ యమునమ్మ, వైస్ చైర్మన్ గోవర్ధన్, జడ్పిటిసి యామిని, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ లు కోడూరు కల్పలత, యారం మంజుల, నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, బత్తిని విజయ్ కుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, మీరా రెడ్డి, మురళి, అజీజ్ ఖాన్, ఏఎంసీ డీడీ శ్రీకాంత్ రెడ్డి, జేడీ రామాంజనేయులు, ఏడీ సురేంద్ర బాబు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనపై ముందస్తు భద్రత ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్,ఎస్పీ

విశాలాంధ్ర - రేణిగుంట: ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి జూలై 21న తిరుపతి జిల్లాలోని వెంకటగిరి పట్టణంలో వైఎస్ఆర్ నేతన్న నేస్తం కార్యక్రమంలో పాల్గొననున్నారని పర్యటనలో చిన్నపాటి లోపలకు తావివ్వరాదని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి సూచించారు. (ముందస్తు భద్రత లైజన్) భాగంగా బుధవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో సంబంధిత అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ కె .వెంకట రమణారెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డితో కలిసి సమీక్షించి పలు సూచనలు చేశారు. జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన 21న ఉ.9.15గం. రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి 9.45 గం. వెంకటగిరి విశ్వోదయ జూనియర్ కళాశాల గ్రౌండ్ హెలిపాడ్ చేరుకుంటారు, అనంతరం 10.05 గం. బహిరంగ సభ ప్రాం గణం చేరుకొని ఫోటో సెషన్ , వైఎస్ ఆర్ విగ్రహానికి పూలమాల సమర్పించి వై ఎస్ ఆర్ నేతన్న నేస్తం పై ప్రజలనుద్దేశించి ప్రసంగించి 11.50 గంటలకు త్రిభువనం వద్ద లేట్ మాజీ ముఖ్యమంత్రి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ నేదురుమల్లి జనార్ధన రెడ్డి విగ్రహా ఆవిష్కరణ చేపట్టి , హెలిపాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో, స్థానికులతో మాట్లాడి మ.12.25 గం. హెలిపాడ్ నుండి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని మ.1.10 గం.కు గన్నవరం తిరుగుప్రయాణం కానున్నారని భద్రతా ఏర్పాట్లు పగడ్బందీగా వుండాలని సూచించారు. వైద్య శాఖ స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, అంబులన్స్, సేఫ్ రూమ్, అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, ఫైర్ అధికారులు ఫైర్ సేఫ్టీ చర్యలు, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఎస్పి మాట్లాడుతూ బందోబస్తు పటిష్టంగా ఉండాలని విధులు కేటాయించిన పోలిస్ అధికారులకు, పోలీసులకు భద్రతపై సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకాళహస్తి రామారావు, ఏర్పోర్ట్ సి ఎస్ ఓ రాజశేఖర్ రెడ్డి, డిప్యూటీ కమాండెంట్ కున్వర్ బహదూర్, ఏఎస్పీలు కులశేఖర్, విమల కుమారి, వెంకట్రావు, ముని రామయ్య, డిఎస్పీ లు భవ్యశ్రీ, గిరిధర్, రవీంద్ర రెడ్డి, రుయా ఆస్పత్రి సూపరింటెంట్ రవి ప్రభు, డిఎంహెచ్ఓ శ్రీహరి, జిల్లా ఆర్ అండ్ బి అధికారి సుధాకర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రెడ్డప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళల అరెస్టు, విడుదల

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు, మాజీ శాసనసభ్యురాలు వంగలపూడి అనితపై వైసీపీ నాయకులు సోషల్ మీడియా లో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని... రాష్ట్రంలో మహి ళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం శ్రీకాళహస్తిలో శాంతి యుతంగా నిరసనరకు దిగిన తెలుగు మహిళలను 1వ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం తెలుగుదేశం నేతల పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో తెలుగు మహిళలు తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, నియోజకవర్గ అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ అధ్యక్షురాలు సుమతి, దుర్గమ్మ, శ్రీలక్ష్మి, కుమారి, సుజాత, సరోజనమ్మ, అనిత, సుభాషిణి ఉన్నారు. వీరిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, గుమ్మడిపూడి దశరథాచారి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల రవి, మాజీ కౌన్సిలరు బషీర్ పూచీ ఇచ్చి విడుదల చేయించారు.

నేడు ఉచిత హోమియో వైద్యశిబిరం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి సంబంధించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు డాక్టర్ కేర్ హెూమియోపతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత హెూమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ సాగర్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రొటో కాల్ ఉల్లంఘన

విశాలాంధ్ర - గూడూరు : గూడూరులో రైతు బజార్ ప్రారంభోత్సవానికి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వచ్చారు. సంబంధిత వేదికపై వైసీపీ నాయకులు ఆశీనులయ్యారు. మార్కెటింగ్ కమిటీ ఏడీ, గూడూరు మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ శాడల ఉన్నతాది కారులకు చోటు లేకపోవడంతో వేదిక కిందే కూర్చుండి పోయారు. ఏఎంసీ నిర్మించిన రైతు బజారుకు సంబంధించి ఏఎంసీ అధికారులు అధ్యక్షత వహిం చాల్సి ఉండగా అందుకు భిన్నంగా వైసీపీ పట్టణాధ్య క్షుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారు లంతా స్టేజీ కిందే..రైతు బజార్ ను బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రారంభిచారు. సహజంగా ఈ కార్యక్రమాన్ని అగ్రికల్చర్ మార్కెటింగ్ సొసైటీ అధికారులు నిర్వహిం చాల్సి ఉండగా దీనికి భిన్నంగా ప్రజా ప్రతినిధులే అంతా తామై నిర్వహించారు. సదస్సు నిర్వహిస్తున్న డయాస్ పై వైసీపీ మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, నాయకులు మాత్రమే ఆశీనులయ్యారు. ఏంఎసీ డీడీ, జేడీ, ఏడీలు, వ్యవసాయ శాఖ అధికారులు సదస్సుకు దూరంగా కూర్చున్నారు. ఒక రకంగా సదస్సు ప్రభుత్వ పరంగా కాకుండా పార్టీ పరంగా నిర్వహించినట్లు స్థానిక రైతులు గుసగుసలాడుకోవడం వినిపించింది.

అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరులో తూనికలు కొలతలు శాఖ ఇన్ స్పెక్టర్ పి. భరత్ కుమార్ బుధ వారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వారిపై ఏడు కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకాలు, కొలతల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుపతి జిల్లా డిప్యూటీ కంట్రోలర్ జీవీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు గూడూరు పట్టణంలో తనిఖీలు చేశామన్నారు.

సబ్సిడీ బియ్యం, టమోటాల కోసం పేదల నిరీక్షణ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరులో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు బజార్ లో బుధవారం సబ్సిడీ బియ్యం, టమోటాల కోసం నిరుపేద ప్రజలు నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి బుధవారం రైతు బజార్ ప్రారంభించేందుకు గూడూరుకు విచ్చేశారు. అయితే అదే సమయంలో నిరుపేదలకు సబ్సిడీలో బియ్యం, టమోటాల తీసుకునేందుకు పేద ప్రజలు ఉదయం ఎనిమిది గంటల నుండే ఎదురు చూశారు. మంత్రి సదస్సు సుమారు మూడు గంటలపాటు కొనసాగింది. అప్పటి వరకూ పేద మహిళలు క్యూలోనే నిలబడి నిరీక్షించారు. సుమారు వంద మంది సబ్సిడీ బియ్యం, టమాటాల కోసం క్యూ లోనే ఉన్నారు. సదస్సు అనంతరం మంత్రి చేతుల మీదుగా సబ్సిడీ బియ్యం, టమోటాలు పంపిణీ చేశారు.

ఘనంగా మాజీ వైస్ ఎంపిపి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - రామచంద్రాపురం : రామచంద్రాపురం మండలం మాజీ వైస్ ఎంపిపి కె మధుసూధన్ రెడ్డి 43వ జన్మదిన వేడుకలు తన స్వగ్రామం నెన్నూరులోని స్వగృహంలో కుటుంబ సభ్యులు దేశం మండలపార్టీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో మురళి నాయుడు, గిరిబాబు,జయచంద్రనాయుడు, ధనుంజయ రెడ్డి, గరుడాద్రి నాయుడు కిశోర్ రెడ్డి, గోపి నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, అధికారులు

విశాలాంధ్ర - వెంకటగిరి: వెంకటగిరి నియోజవర్గంలో ఈనెల 21న నేతన్న నేస్తం పథకమును వెంకటగిరిలో లాంచ్ చేయుటకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మో హన్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా వెంకటగిరిలోని సభా ప్రాంగణంలోని ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు నారాయణస్వామి తిరుపతి జిల్లా అధ్యక్షులు వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ నేదురమల్లిరామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మరియు జిల్లాస్థాయి అధికారులు

'జగనన్న తోడు' - ఓ బూటకం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : చిన్న చిన్న పెట్టుబడులతో, వీధులలో తిరుగుతూ వ్యాపారాలు చేసుకునే వారికి భారీ ఎత్తున ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నట్లు తన సొంత మీడియాలో డబ్బా కొట్టుకుంటూ ప్రకటనల రూపంలో వందల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న జగనన్న ప్రవేశ పెట్టిన 'జగనన్న తోడు' పథకం ఓ బూటకం అని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు.పట్టణ ప్రాంతాలలో గల వీధి వ్యాపారస్తులకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి స్వానిధి' పేరుతో ఇప్పటికే అమలు చేస్తున్న పథకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'జగనన్న తోడు' పథకంగా జగన్మోహన్ రెడ్డి మార్చుకొని ప్రచారం చేసుకోవడం దిగజారుడు వ్యక్తి త్వానికి నిదర్శనమని ఆరోపించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిరు వ్యాపారులకు ఉపయోగపడే ఈ పథకాన్ని వైసిపి నాయకులు కబ్జా చేసి 90% పైగా తమ వారికి ఇచ్చుకున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు.చిరు వ్యాపారులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డులు జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం వలన అర్హులైన వారు రుణాలు పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.జగనన్న తోడు పథకం కాస్తా వైసిపి కార్యకర్తల 'పాకెట్ మనీ' పథకంలా తయారైందని ఆరోపించారు.జగన్మోహన్ రెడ్డి అందించే సాయం పైసల్లో ఉంటే, ప్రచారం లక్షల్లో ఉందని ఎద్దేవా చేశారు.బ్యాంకు మంజూరు చేసే రుణాలకు కూడా జగనన్న బటన్ నొక్కడం ప్రపంచ వింతలలో వింతగా ఉందని ఎద్దేవా చేశారు. అన్ని అర్హతలను పరిశీలించాక లబ్ధిదారులకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయడాన్ని జగనన్న హైజాక్ చేసినట్లుంది. కేవలం 11.03 కోట్ల రూపాయల వడ్డీ రీయింబర్స్మెంట్‌ను మాత్రమే బటన్ నొక్కాల్సిన జగనన్న, బ్యాంకులు మంజూరు చేసే రుణాలకు కూడా బటన్ నొక్కడాన్ని యాంకరింగ్ స్టార్ సజ్జల బాగానే ఊదరగొడుతున్నాడని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సాధికార సమితి సభ్యులు మిన్నల్ రవి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు బీమాల భాస్కర్ ముదిరాజ్, మణి, వంశీ పాల్గొన్నారు.

నగరంలో రోడ్లను ఆధునికరిస్తున్నాం

------ సిసి రోడ్డును ప్రారంభించిన తిరుపతి ఎమ్మెల్యే ------

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని అంతర్గత మార్గాలన్నింటిని ఆధునికరించి నూతన సిసి, బిటి రోడ్లుగా ప్రారంభిస్తున్నామని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు. తిరుపతి నగరంలోని తాతానగర్లో సిసి రోడును, కాలువలను బుధవారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళ్ళిక రెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్భంగా తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్ మాట్లాడుతూ తాతానగర్లో గంగమ్మ గుడి కూడలి నుండి ప్రశాంత్ స్కూల్ వరకు సిసి రోడ్డును, పెద్ద కాలువను 67.20 లక్షల వ్యయంతో నిర్మించి, నేడు ప్రారంభించడం జరిగిందన్నారు. తిరుపతి పట్టణంలో పాడైపోయిన రహదారులను, ప్రాధాన్యతా క్రమంలో ఆధునికరించడం, అదేవిధంగా అవసరమైన చోట్ల నూతన రహదారులు నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంట్టున్నామని, త్వరలో మరికొన్ని రహదారులను ప్రారంభించడం జరుగుతుందని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎస్.ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డిఈ దేవిక, నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్ రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, జల్లి తులసీ యాదవ్, ఇతమాకుల సురేష్ యాదవ్, చింతా భరణి యాదవ్, చింతా రమేష్ యాదవ్, రిటైర్డ్ ఏ.ఎస్.పి దేవదానం, రిటైర్డ్ డి.ఎస్.పి నంజుండప్ప, వెంకటేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మన పీలేరులో మన కిషోర్

విశాలాంధ్ర -పీలేరు: నేడు గురువారం మన పీలేరులో మన కిషోర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంనికి విచేస్తున్నారని పీలేరు మండలం తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు వి. శ్రీకాంత్ రెడ్డి.తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గం ఇంచార్జ్ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు గురువారం మధ్యాహ్నం 3గంటలకి పీలేరు మండలం తెలుగుదేశంపార్టీ క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు,గ్రామ కమిటీ అధ్యక్షులు,బూత్ కన్వినర్లు,సెక్షన్ కమిటీలు, బూత్ ఏజెంట్లు, బూత్ కమిటీ సభ్యులకు పీలేరు తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మరియు ఓటర్ వెరిఫికేషన్ శిక్షణ నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ప్రతి కుటుంబానికి టిడిపి సంక్షేమ పథకాలు : కుప్పం రవిచంద్రారెడ్డి

విశాలాంధ్ర-పీలేరు: 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబానికి టిడిపి సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ కార్యవర్గ కార్యదర్శి కుప్పం రవిచంద్ర రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమం శ్రేయస్సు కోసం ప్రవేశపెట్టిన తొలి మహిళా శక్తి మేనిఫెస్టో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపి కార్యకర్తలు, నేతలు, శ్రేణులు, సిద్ధంగా ఉన్నారని మంచి మనిషి, జనం మెచ్చిన నేత, ప్రజా సేవకులు పీలేరు టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి రానున్న సార్వత్రిక ఎన్నికలలో గ్రామీణ ప్రాంతాల సైతం నియోజకవర్గం అంతా పర్యటించి వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యపరిచి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని కుప్పం రవిచంద్ర రెడ్డి తన ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

శ్రీనివాస సేతు నిర్మాణ పనులు పూర్తిచేయాలి

- టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి: శ్రీనివాస సేతు నిర్మాణ పనులు ఆగష్టు 5వ తేదీకి పూర్తి చేసి భక్తులకు అందుబాటు లోకి తీసుకురావాలని టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం టీటీడీ పరిపాల భవనంలోని తన ఛాంబర్ లో టీటీడీ, మున్సిపల్ అధికారులతో శ్రీనివాస సేతు నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, రైల్వే ఓవర్ బ్రిడ్జి పైన గడ్డర్స్ ఏర్పాటు తదితర పనుల ప్రక్రియ వేగవంతం చేసి ఆగష్టు 5 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ శ్రీమతి హరితను కోరారు. రోడ్లకు ఇరువైపులా మీడియన్స్, డ్రైనేజి, డివైడర్లు, సుందరీకరణ, తారు రోడ్డు పనులను ఏకకాలంలో చేపట్టాలన్నారు. నిర్మాణ పనులకు అడ్డంకిగా వున్నభూగర్భంలోని విద్యుత్ వైర్లను తొలగించేందుకు తగినంత మంది సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శ్రీ సంతోష్ రావును కోరారు.మీడియన్స్ ఏర్పాటు, కాలువలు, సెంట్రల్ డివైడర్లు, వీధుల ఆధునీకరణ, అవసమయిన చోట్ల పెయింటింగ్, ఎలక్ట్రికల్, మొక్కల పెంపక పనుల పురోగతికి సంబంధించి ఒక బార్ చార్ట్ ను ఏర్పాటు చేసుకొని, తదనుగుణంగా పనులను వేగవంతం చేయాలని ఆయన మున్సిపల్ కమీషనర్ ను కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ భూమన్ అభినయ్ రెడ్డి, జేఈ వో సదా భార్గవి, సిఈ నాగేశ్వరరావు, మున్సిపల్ ఎస్ఇ మోహన్, ఈఈ చంద్ర శేఖర్, ఆఫ్కాన్స్ ప్రతినిధి శ్రీ రంగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దామోదరం సేవలు అమోఘం

- వైఎస్ఆర్ సిపి జిల్లా వ్యవసాయ బోర్డు కమిటీ అధ్యక్షులు రఘునాథ రెడ్డి

విశాలాంధ్ర - రామచంద్రాపురం : రామచంద్రపురం మండలంలోని కుప్పం బాదూరు రఘునాథ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన మాదాసి దామోదరం చేసిన కృషి అమోఘం అని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ప్రస్తుత వైసిపి జిల్లా వ్యవసాయ సలహా బోర్డు కమిటీ అధ్యక్షులు పి రఘునాథరెడ్డి అన్నారు పాఠశాల ఆవరణలో బుధవారం ఇటీవల యంఇఓగా పదోన్నతపై వెళ్లిన మాదాసి దామోదరం, బదిలీపై వెళ్లిన వ్యాయామ ఉపాధ్యాయుడు పూర్ణానంద లకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు ఈ సందర్భంగా వారిద్దరిని పూల వర్షం పైన నడిపించి శాలువలు కప్పి సన్మానించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యనభ్యసించి దామోదరం తిరిగి ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించటం ఎంతో గొప్ప విషయం అన్నారు పాఠశాల ప్రగతిలో దామోదరం చూపిన సొరవ పలువురికి ఆదర్శమని చెప్పారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు సృజని కుమారి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దామోదరం చూపిన బాటలో తాము కూడా ముందుకు సాగుతామన్నారు. పాఠశాలలో సౌకర్యాల పరంగా గాని విద్యాపరంగా గాని అందరి సహకారంతో ఉన్నత ప్రగతిని సాధించడానికి కృషి చేస్తామన్నారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు సురేష్ రెడ్డి మాట్లాడుతూ తీర్చిదిద్దడంలో మాజీ ప్రధానోపాధ్యాయులు దామోదరం ఎంతో గొప్ప విలువలను పాటించారని కొనియాడారు. పాఠశాలలో ఉన్నత విద్యా ప్రమాణాలు కొనసాగించటానికి తామంతా శక్తివంచన లేకుండా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.ఈకార్యక్రమంలో మాజి సింగిల్ విండో అధ్యక్షులు తిరుమల రెడ్డి,రాయల చెరువు సర్పంచ్ మురగయ్య, యంపీటీసి కృష్ణవేణి, స్థానికులు మారయ్య, తెలుగు ఉపాధ్యాయులు దండు రామచంద్రయ్య, హిందీ ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవదాన్యాలు సిద్ధం

విశాలాంధ్ర-చిల్లకూరు: చిల్లకూరు మరియు తొణుకు మాల యూనిట్ సభ్యులు తిరుపతి జిల్లా ప్రక్రుతి వ్యవసాయ పథకం అదికారి గంగారపు మునిరత్నం సూచనలతో, మండల వ్యవసా య శాఖ అధికారిణి భవాని సమన్వయం తో13 రకముల విత్తనాలతో 750 కిలోల నవధాన్యాల కిట్లు తయారీ చేయడం జరిగింది. ఎవో భవాని మాట్లాడుతూ ఒక కిట్లో 12 కిలోల విత్తనాలు వాడి ఒక ఎకరం పొలంలో వ్యవసాయం చేయడం ద్వారా రైతులు అదిక దిగుబడి తద్వారా ఎక్కువ ఆదా యం పొందవచ్చు అని తెలిపారు. నిమ్మ తదితర తోటలలో అంతర పంటగా కూరగాయల సాగు చేయవచ్చు అని అన్నారు. నవధాన్యాల వలన భూమి పచ్చగా ఉంటుంది సూర్యరశ్మి నేరుగా తాకదు , నేల కోతకు గురి కాకుండా సారవంతం అవ్వడం, సూక్ష్మ జీవుల అభివృద్ధితో భూముల లో తేమ పెరగడం, కార్బన్ మరియు నత్రజని పెరగటానికి తోడ్పడుతాయి.

ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పాకాల : త్వరలో జరగనున్న ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ చంద్రగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎం. ప్రకాష్ కోరారు. బుధవారం స్థానిక పట్టణంలో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రా లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ మంగళవారం తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేనిశివయ్యభవన్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు జరగనున్నాయని, నూతనంగా జిల్లా ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి జిల్లా మహాసభలు ఇవేనని తెలిపారు. కావున ఆటో కార్మికులందరూ ఈ మహాసభలకు విచ్చేసి వీటిని విజయవంతం చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి రాజా, నాయకులు శ్రీరాములు ఆటో కార్మికులు ఖాదర్ , పురుషోత్తం , మాషీర్ ,కేశవులు , నరసింహులు , షాహీర్ , శీను తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

------- వైస్ యంపిపి వేమారెడ్డి కుమార్ -------

విశాలాంధ్ర -చిల్లకూరు: ప్రియతమ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చిన జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలు తమకు కావలసిన ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి నగదు చెల్లింపు జరపనవసరం లేకుండా ఉచితంగా గ్రామ సభలో అధికారుల ద్వారా తీసుకోవచ్చు అని మండల ఉపాధ్యక్షులు వేమారెడ్డి కుమారస్వామి రెడ్డి మోమిడిలో యంపిడివో నిర్మలదేవి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గ్రామ సభలో తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వరగలి గ్రామంలో తహశీల్దార్ బృందం గ్రామ సభ నిర్వహించారు.

రైతు బజార్ ప్రారంభోత్సవంలో చిల్లకూరు నాయకులు

విశాలాంధ్ర -చిల్లకూరు: రైతు బజార్ ప్రారంభోత్సవంలో ఎయంసి ఓడూరు యమునమ్మతో పాటు , చిల్లకూరు నాయకులు అన్నంరెడ్డి పరంధామి రెడ్డి, ఓడూరు బాలక్రిష్ణారెడ్డి , చిల్లకూరు మరియు తిప్పగుంటపాళెం పోఏసిఎస్ ల , అధ్యక్షులు చేవూరు నాగరాజు, రాజనేని విచ్చయ్య నాయుడు, రైతు సలహామండలి సభ్యులు చిట్టేటి నారాయణ, ఎన్ఆర్ పల్లి మాజీ సర్పంచి రవి రెడ్డి, బూదనం దిలీప్ రెడ్డి, రమేష్ రెడ్డి, ముత్యలపాడు దిలీప్ రెడ్డి, ఓడూరు బూతు సుబ్రమణ్యం మరియు జడ్పీటీసీ మన్నెం శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - రామచంద్రాపురం : మండలం లోని మిట్టవేపకుప్పం కు చెందిన పేట భాస్కర్ రెడ్డి (57) బుధవారం ఉదయం 4 గంటలకు పనులనిమిత్తం తన పొలానికి వెళుతున్నానని ఇంటిలో భార్యకు చెప్పి పొలం దగ్గరకు వెళ్ళిన భాస్కర్ రెడ్డి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అనుమానాస్పదంగా మృతిగా గుర్తించినట్లు పోస్ట్ మార్టం నిమిత్తం తిరుపతి రూయాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి : కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు.బుధవారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలను, వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్ర మం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తో పాటు చిత్తూరు ఎం ఎల్ ఏ ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన సహాయం ప్రభుత్వం తరఫున అందించడానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 1340 మంది విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ట్రై సైకిల్ లు, సెల్ ఫోన్ లు, వాకింగ్ స్టిక్ లు, కృత్రిమ అవయవాలు వంటి ఉపకరణాలను, వినికిడి యంత్రాలు మొత్తం 2221 ఉపకరణాలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఈ సంవత్సరంలో చిత్తూరు జిల్లాకు సంబంధించి 70 మందికి జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేసిన వారికి మోటరైజ్డ్ స్కూటర్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా అవసరమున్న వారికి బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ల పంపిణీకి తప్పకుండా ప్రభుత్వం తరఫున కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎం ఎల్ ఏ మాట్లాడుతూలి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపకరణాలను, వినికిడి యంత్రాల పంపిణీ చేయడం జరుగుతున్నదన్నారు. చిత్తూరు నియోజకవర్గానికి చెందిన దాదాపు 160 మందికి ఈ ఉపకరణాలు అందించడం జరుగుతున్నదన్నారు. నగర మేయర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కావలసిన సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. నవరత్నాలు కార్యక్ర మం ద్వారా విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమానికివిభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్, రవి శంకర్, ప్రతి నిధులు, పాల్గొన్నారు.

మళ్ళీ ఆదరించండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గంగవరం: మండలంలోని గంద్రాజుపల్లి -1,2 సచివాలయాల పరిధిలో రెండవ రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మర్రిమాకులపల్లి, సామలగడ్డ, ఇండ్లు, గంద్రాజుపల్లి, నాలుగు రోడ్లు నందు నిర్వహించారు. ప్రతి గృహాన్ని సందర్శించడం జరిగింది.ఇంటిం టికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహనకల్పిస్తూ..పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ప్రజలకు బుక్లెట్లను అందజేశారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకే దక్కుతుంది.. రాజకీయాలు, పార్టీలు, మతాలు, కులాలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. .కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాసిడ్ విక్రయదారులు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర -చిత్తూరు: యాసిడ్ విక్రయిదారులు విధిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని డి.ఎస్.పి శ్రీనివాసమూర్తి తెలిపారు. బుధవారం చిత్తూరు సబ్ డివిజన్పరిధిలోని యాసిడ్ విక్రయ దారులతో చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్ నందు పట్టణ డి.ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా డి.ఎస్పీ మాట్లాడుతూ మహిళల పైన, బాలికల పైన ప్రాణాంతకమైన యాసిడ్ చల్లడం వంటి తీవ్రమైన నేరాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టడానికి పోలీసులు చర్యలకు ఉపక్రమించా రన్నారు. అందులో భాగంగా సబ్-డివిజన్ పరిధిలో యాసిడ్ సులభంగా మార్కెట్లో ఎక్కడ దొరుకుతుంది, ఏఏ దుకాణాల వారు వాటిని అమ్ముతున్నారు, వారికి సరియైన లైసెన్సులు గానీ, అధికార పత్రాలు కానీ, అనుమతులు కానీ ఉన్నాయా అనే కోణంలో ఈరోజు విక్రయ దారులతో సమావేశం ఏర్పాటు చేసామని, సంబంధిత దుకాణదారులు ఆసిడ్ ను ఎక్కడ నుండి కొనుగోలు చేస్తున్నారు, ఏ పరిమాణంలో చేస్తున్నారు, ఎవరికి అమ్ముతున్నారు, తగిన రికార్డులను నిర్వహించాలని, యాసిడ్ నిల్వ ఉంచడానికి తగిన భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా అనే కోణంలో కూడా ఆరా తీసారు. యాసిడ్ అమ్మకాలలో అక్రమ పద్ధతులు అనుసరించినా, పరిమితికి మించి నిల్వ చేసినా అర్హులు కాని మైనర్ బాలబాలికలకు గానీ, యువకులకు గానీ యాసిడ్ అమ్మిన యెడల చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. యాసిడ్ అమ్మకాలు జరిపే దుకాణదారులపై దాడులు నిర్వహిస్తామని అటువంటి సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు తనిఖీలలో తేలితే వారిపై తగు క్రిమినల్ చర్యలు అపరాధ రుసుములు విధించుటకు నివేదికలు కూడా పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ విశ్వనాథ రెడ్డి, ఈస్ట్ ఇన్స్పెక్టర్ గంగి రెడ్డి, వెస్ట్ ఇన్స్పెక్టర్ రవి శంకర్ రెడ్డి, కల్లూర్ ఇన్స్పెక్టర్ శ్రీ కె.శ్రీనివాసులు, సబ్-డివిజన్ ఎస్.ఐ.లు మరియు దుకాణదారులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు మదర్ థెరిసా విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - గంగవరం: మండలంలోని మదర్ తెరిసా ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్ వేరు ఉద్యోగాలకు ఎంపికైన ట్లు కరెస్పాండన్ రవీంద్ర బాబు తెలిపారు. బుధవారం బెంగుళూరు కు చెందిన కలవీసా అనే కంపెనీ వారు నిర్వహిచిన కాంపెస్ ఇంటర్వ్యూ లో 8మంది ఎంపికైన ట్లు తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.5లక్షలు జీతం వస్తోందని తెలిపారు. ఉద్యోగం పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ సునీల్, అకాడమిక్ అడ్వైసర్ రాజేంద్ర రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

సీమ అభివృద్దే మిషన్ రాయలసీమ లక్ష్యం

విశాలాంధ్ర - గంగవరం: సీమ అభివృద్దే మిషన్ రాయలసీమ కార్యక్రమ లక్ష్యం అని మండల తెలుగు యువత అధ్యక్షుడు గిరిధర్ గోపాల్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టత్మకంగా చేపడుతున్న మిషన్ రాయలసీమ కార్యక్రమాన్ని తెలుగు యువత నాయకుల ఆధ్వర్యంలో గంగవరం పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ..... తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రానున్న ఐదేళ్లలో రాయలసీమ ప్రాంతాన్ని ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తామని యువనేత హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రాయలసీమ ప్రాం తంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఉపాధికి గమ్యస్థానంగా రాయలసీమను మారుస్తామ న్నారు. ఇప్పటివరకు రాయలసీమ ప్రాంతానికి ఏమి చేసినా అది తెలుగుదేశం ప్రభుత్వమే చేసిందని, తెలుగుదేశం అధికారంలోకి వస్తే రాయలసీమ ప్రాంతాన్ని ప్రగతి కేంద్రంగా, ఉపాధి, ఉద్యోగాలకు గమ్యస్థానంగా మార్చేందుకు తెలుగుదేశం కృషి చేస్తుందన్నారు. యువగళం లో భాగంగా నారా లోకేష్ రాయలసీమలో వేసిన ప్రతి అడుగు ఈ ప్రాంత అభివృద్ధికేనన్నారు. మనందరి భవిష్యత్ కోసం బాబును గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు మంజునాథ్ రెడ్డి, నాయకులు చందు,లోకేష్,ఉమా, సుబ్బు, తాజ్ కుమార్, వెంకీ, మధు, బాబు,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పోస్తకాలు వితరణ

విశాలాంధ్ర - కార్వేటినగరం : మండల పరిధిలోని కత్తెరపల్లి దళితవాడ ప్రాథమిక పాఠశాలలో బుధువారం కుపయ్య కుమారుడు కె. ప్రసాద్ రూ.5 వేలు విలువ చేసే పుస్తకాలను విద్యార్థులకు వితరణ చేసినట్లు పాఠశాల హెచ్ఎం గోవిందయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరు చక్కగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోసూర్యప్రకాష్తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ నిధులతో హాస్టల్ మరమ్మతులు

విశాలాంధ్ర - పాలసముద్రం : మండలంలో బీసీ బాలికల హాస్టల్ మరియు బాలుర హాస్టల్ లో మరమత్తులను ఎంపీపీ నిధులతో బాగు చేసి ఇస్తామని ఎంపీపీ శ్యామల శివ ప్రకాష్ రాజు అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యాలు దృష్టిలో ఉంచుకొని మరమ్మత్తులు చేపడతామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చౌడేపల్లి : చౌడేపల్లి మండలంలోని చౌడేపల్లి పుంగనూరు రహదారిలో పెద్ద ఎల్లకుంట్ల దగ్గర బులోరా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు పోలీసుల వివరాల మేరకు సదుం మండలం ఖమ్మం వారిపల్లి పంచాయతీ గాండ్లపల్లి నాగరాజా కుమారుడు భాను గుర్తించారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

టిడిపి పార్టీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు: తెలుగుదేశం పార్టీతోనే భవిష్యత్తు గ్యారెంటీ అని పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు.పులిచెర్ల మండలం కొత్తపేటలో బుధవారం ఇంటింటికి మీ చల్లా రామచంద్రారెడ్డికార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి బలోపేతానికి నాయకులు కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడిపోయిందని అన్నారు .రాష్ట్ర ప్రగతి టిడిపి తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.టిడిపి మినీ మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్లి వివరించారు .కొత్తపేటలో చల్లా రామచంద్రారెడ్డికి టిడిపి శ్రేణులు ఘనంగా స్వాతం పలికారు.మహిళలు మంగళ హారతులు స్వాగతం పలుకుగాక్రేన్ సహాయంతో గజమాలతోస్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు రామనాథం నాయుడు ,మండల టిడిపి అధ్యక్షులు కృష్ణమూర్తి నాయుడు ,కార్యదర్శి రమేష్, ఎంపీటీసీలు ముని కృష్ణమ నాయుడు, సింధు, నాయకులుసుబ్బారెడ్డి, ధనుంజయ నాయుడు,లోకేష్,కుమార్ రెడ్డి దేవేంద్ర, గోపి నాయుడు,సాగర్ ,శంకర ,మురళి నాయుడు, పరంధామనాయుడు,సుబ్రహ్మణ్యం, నాగరాజు నాయుడు,చంగల్ రాయ నాయుడు, రవిభాస్కర పాల్గొన్నారు.

తుడుమువారిపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు: పశువులకు ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టినప్పుడే ఎక్కువ పాల దిగుబడిసాధ్యమవుతుందని పశువైద్యాధికారి ముని చంద్ర అన్నారు.పులిచెర్ల మండలం తుడుము వారి పల్లిలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలోవర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చికిత్సలపై సమగ్రంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఏ హెచ్ ఓ దామోదరం, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో మీ సేవలు అజరామం

-------- నూతన ఎంఈఓలకు ఘన స్వాగతం --------

విశాలాంధ్ర - ఐరాల : గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువుకు దూరం కాకుండా విద్యారంగంలో ఎనలేని సేవలు అందించిన ఘనత వేణుగోపాల్ రెడ్డికే దక్కుతుందని, ఎంఈఓ లు రుషీంద్ర బాబు, దామోదర్ నాయుడు మరియు ఉపాధ్యాయ సంఘం నాయకులు పేర్కొన్నారు. గత 11 నెలలుగా ఐరాల మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహించి, గంగవరం మండలం విద్యాశాఖ అధికారిగా బదిలీ పై వెళ్లిన వేణుగోపాల్ రెడ్డికి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయమునందు బుధవారం మండలంలోని ఉపాధ్యాయినీ ,ఉపాధ్యాయులు శాలువా కప్పి, గజమాలతో సత్కరించారు. అనంతరం నూతనంగా బాధ్యతలుచేపట్టిన ఎంఈఓ 1 రుసీంద్రబాబు, ఎంఈఓ 2 దామోదర్ నాయుడును స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. సందర్భంగా ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ అధికారిగా పనిచేసిన కాలంలో సహకరించిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఎం .ఆర్ .సి .సిబ్బందికిఅభినందనలు తెలిపారు. అలాగే మన నిజజీవితంలో ఉపాధ్యాయ వృత్తి చాలా విలువలతో కూడుకున్నదని, ఈ వృత్తిలో మానసిక ఆందోళనకు గురికాకుండా ఉల్లాసంగా, ఉత్సాహంగా విద్యార్థినీ ,విద్యార్థులకు మంచి విద్యను అందించడమే మన లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ .టి.యు. నాయకులు యుగంధర్ రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, యు.టి.ఎఫ్ .నాయకులు ఏకాంబరం,అరుణ్ కుమార్, సురేష్ బాబు, దేవరాజులు నాయుడు, పి .ఆర్ .టి .యు .నాయకులుశ్రీనివాసులు,మధు,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఎం .ఆర్ .సి.సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వ్యాధి నిరోధక టీకాలు పై అవగాహన

విశాలాంధ్ర -తిరుపతి: బైరెడ్డిపల్లి వైద్యాధికారి హేమ చంద్ర ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్ర మంలో భాగంగాబుధవారం బైరెడ్డిపల్లి పి హెచ్ సి నందు హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి ఆరోగ్య విద్య బోధిస్తూ గర్భవతులు, బాలింతలు ప్రతిరోజు అందుబాటులో ఉండే పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు ,మాంసము చేపలు పప్పు దినుసులు, తృణధాన్య ములు మొదలగునవి తినాలని మరియు చేతులు, వ్యక్తిగత శుభ్రత నులి పురుగుల నివారణ గురించి తెలిపారు తల్లిపాలు ప్రాముఖ్యత వ్యాధినిర్వధక టీకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మి ఆశాలు రాజేశ్వరి మోబీన జయమ్మ పాల్గొన్నారు.

బోల్తా పడ్డ వాటర్ ట్యాంకర్ తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర - చౌడేపల్లి : వాటర్ ట్యాంకర్ లారీ బోల్తా పడి ఎలాంటి ప్రమాదం సంభవించకుండా బయటపడ్డ సంఘటన చౌడేపల్లిలో ఉదయం చోటుచేసుకుంది చౌడేపల్లి పలమనేరు ప్రధాన రహదారిలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ముందర రోడ్డు పనులు జరుగుతున్నాయి అనంతరాయుని చెరువు కల్వర్టులు నిర్మాణంలో భాగంగా సిమెంట్ రోడ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి సిమెంటు రోడ్డుకు వాటర్ ట్యాంకర్ కలిగిన లారీతో నీరు పట్టే క్రమంలో లారీ వెనుక భాగంలోని టైరు పంచరు కావడంతో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి హాని జరగలేదు వెంటనే అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సరఫరాను ఆపేయడంతో పెను ప్రమాదం తప్పింది ఆర్టీసీ బస్టాండుకు కూత వేటు దూరంలో ఈ ప్రమాదం జరగడంతో ప్రయాణికులతో పాటు స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

గణనాధుని సేవలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

విశాలాంధ్ర - ఐరాల : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ వి రవీంద్రన్ బుధవారం కాణిపాకం విచ్చేశారు. వారిని ఆలయ ఏఈఓ ఎస్ వి కృష్ణారెడ్డి స్వాగతం పలికి, స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులచే ఆశీర్వచనం, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్స్ ఇన్స్పెక్టర్ బాబు మరియు జిల్లా కోర్టు సిబ్బందితో జల్లు పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్లకు కెనాన్ కంపెనీ వారిచే ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - పలమనేరు : పలమనేరులో ఉన్న ఫోటోగ్రాఫర్లకు ఉచిత శిక్షణ కార్యక్రమం బుధవారం పట్టణంలోని స్థానిక పీజేసీ కళ్యాణ మండపంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పలమనేరు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడు పి ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ... మన జిల్లాలోనే ఎవరికి ఈ అవకాశం రాలేదని కెనాన్ కంపెనీ వారితో మనం ఉచిత శిక్షణ తీసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ వినియోగించుకొని వారు చెప్పిన మార్గంలో ఫోటో వర్క్ చేస్తే చాలా అందంగా ఉంటుందని తెలిపారు .కెనాన్ కెమెరా కంపెనీ వారితో రెండు సంవత్సరాల నుండి పోరాడివారిని ఒప్పించి ఇక్కడకు తీసుకు వచ్చిన యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమానికి పలమనేరు నియోజక వర్గంలోని ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

తాసిల్దార్‌ను సన్మానించిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

విశాలాంధ్ర - పలమనేరు : నియోజకవర్గం పరిధిలోని పెద్దపంజాణి మండలానికి కొత్తగా వచ్చిన తాసిల్దార్‌కి పూలమాలలు వేసి సెలవుతో సత్కరించారు. అనంతరం వెనుకబ డిన తరగతులకు న్యాయం చేయమని కోరారు. అలాగే స్మశాన వాటికలు లేని గ్రామాలు గురించి తెలియజేస్తూ ముత్తు కూరు నిర్నేపల్లి బంధార్లపల్లి బొమ్మరాజు పల్లి స్మశాన వాటిక లేనందువలన చెరువు నందు వేసుకుం టున్నా మన్నారు. చెరువు నిండిపోతే ఎక్కడ వేసుకోవాలో తెలియని అమాయక ప్రజల గురించి ఎం ఆర్ పి ఎస్, ఎం ఈ ఎఫ్, ఎం ఎస్ పి నాయకులు ఎమ్మార్వో తో మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్ర మంలో పలమనేరు నియోజకవర్గ ఇంచార్జ్ సూరి పాకం యువరాజు మాదిగ, ఎం ఈ ఎఫ్ స్టేట్ లీడర్ బోయకొండ శంకరయ్య, ఎంఆర్‌పిఎస్ పెద్దపంజాణి మండల కన్వీనర్ మణి,మాదిగ నారాయణస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు చంద్రా,రవి,శరవణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - సోమల : సోమల మండలంలోని కందూరు జిల్లా ఉన్నత పాఠశాల లో బదిలీ పై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు కు పాఠశాల చైర్మన్ గాలి సురేష్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులు కు సరళమైన భాషలో పాటలను బోధిస్తూ మండలం లో జరిగిన 10వ తరగతి పరీక్షల లో అత్యధిక మార్కుల తో అధికసంఖ్యలో ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసిన వీరికి సన్మానించడం గర్వంగా ఉందని తెలిపారు. అలాగే యూటీఫ్ అధ్యక్షుడు ఉమాపతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులు మంచి చెడులు నేర్పించి భావితరాలకు ఆదర్శంగా ఉండే విదంగా తీర్చే వారే ఉపాధ్యాయులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బదిలీ పై వెళ్లిన హరినాథ్ రెడ్డి, చాంద్ భాష, హేమలత జయప్రకాష్, రమణయ్య వెంకట సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, కిరణ్, షకీల్ లు మాట్లాడుతూ మేము విధుల్లో ఉన్నంత కాలం మాకు సహాయ సహకారాలు అందించిన తోటి అధ్యాపకుల కు గ్రామస్తులు కు అభివృద్ధి కమిటీ కి మండల స్థాయి అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

లేగ దూడలపై చిరుత దాడి

------ చిరుత దాడిలో మృతి చెందిన నాలుగు లేగ దూడలు ------

విశాలాంధ్ర -తిరుపతి: బైరెడ్డిపల్లి మండలంలోని కడప నత్తం పంచాయతీ గౌనితిమ్మేపల్లి గ్రామ శివారున సుమారు 10 కుటుంబాలు అటవీ సరిహద్దులోని పంట పొలాల వద్ద కొన్ని ఏళ్లుగా పశువులు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. గడిచిన నేల నుండి చిరుత, లేగ దూడలపై పడి మెడ భాగమున కొరికి రక్తం పీల్చుకొని సంఘటన స్థలం నుండి ఉడాయిస్తున్నది. బాధిత రైతన్నలు పారెస్ట్ సిబ్బందికి జరిగిన నష్టంపై మొరపెట్టుకొన్న ఫలితం శూన్యమని వాపోయారు. ఆదివారం, సోమ వారం వరుసగా రెండు రోజులు రాత్రి పశువుల కొట్టంలో నిద్రిస్తున్న లేగ దూడలపై చిరుతదాడిచేసి రెండు దూడలను గాయపరిచాయి.గాయపడి దూడలు లేవలేని పరిస్థితిలో ఉన్నాయి. డాక్టర్ వద్దకు తీసుకెళ్లి చికిత్సలు నిర్వహించిన ఫలితం లేదని తెలిపారు. చిరుతల నుండి రక్షించి ,తగిన నష్ట పరిహారం ఇవ్వాలని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టపగలే ద్విచక్రవాహనం చోరీ

విశాలాంధ్ర -తిరుపతి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని బజారు వీధిలో నివాసం ఉంటున్న దొందోళ్ల కృష్ణమూర్తి కుమారుడు సాయి జయంత్ తన నివాసం ఆవరణంలో రోడ్డు పక్కన తన ద్విచక్రవాహనంను (స్పెండర్‌ప్లస్) పార్క్ చేసి,ఇంట్లోకివెళ్లి భోజనం చేసి,బయట వైపు వచ్చి చూసే లోపు ద్విచక్రవాహనం కనపడకపోవడంతో కంగుతి న్నారు. పక్కనే సచివాలయం, అను నిత్యం జనా లు తిరిగే చోటు చోరీజరగడంతో చుట్టుపక్కల వాసులు ముక్కున వేలేసుకొన్నారు. ఈ సందర్భంగా సాయి జయంత్ మాట్లాడుతూ స్పెండర్ ప్లస్ కెఏ 41 ఈ 6331 నెంబర్ గల వాహనం చోరీ జరిగిన వెంటనే స్థానిక రక్షణశాఖలో ఫిర్యాదు చేయడం జరిగింది. చోరీకి పాల్పడిన వ్యక్తులు గుర్తించి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

తెలుగు మహిళ చక్రాల ఉష అక్రమ అరెస్టు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శ్రీకాళహస్తిలో నిరసనకు సన్నద్ధమైన తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉషను 1వ పట్టణ పోలీసులు అక్రమ అరెస్టు చేశారు. తెలుగుమహిళలతో కలసి శ్రీకాళహస్తి పట్టణంలోని పెండ్లిమండపం వద్ద శాంతియుతంగా నిరసన తెలియచేయడానికి వచ్చిన చక్రాల ఉషను పోలీసులు బలవంతంగా ఆటోలో ఎక్కించి పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా చక్రాల ఉష పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం చక్రాల ఉష మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. శాంతియుతంగా నిరసన తెలియచేయడానికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కును కూడా పోలీసులు కాలరాయడం బాధాకరమన్నారు. మహిళలపై జరిగే అత్యాచారాలు., దాడులు గురించి ప్రశ్నిస్తే పోలీసులు అక్రమ అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమని చక్రాల ఉష ప్రశ్నించారు. వైసీపీ పాలనలో పోలీసులు ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని ఆమె ఆరోపించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, శ్వేతా రెడ్డితో పాటు తెలుగుమహిళల మీద సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెడితే ప్రశ్నించడం తప్పా అన్నారు. వైసీపీ కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో మార్ఫింగులు చేసి మహిళలని కించపరిచే పోస్టులు పెడుతున్నారన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ శాంతియుతంగా నిరసన తెలియచేయడానికి వస్తే తనను పోలీసులు అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమని ఆమె ప్రశ్నించారు. పోలీసులు వైసీపీ నేతల కనుసన్నల్లో పనిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతి రెడ్డి మీద సోషల్ మీడియాలో చిన్న పోస్ట్ పెట్టారని వెంటనే అరెస్టు చేశారన్నారు. అదే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిపై తప్పుడు ప్రచారం చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని చక్రాల ఉష ప్రశ్నించారు. తెలుగు మహిళలను కించపరిచే విధంగా పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండు చేశారు. వైసీపీ చేసే ఆగడాలకు అడ్డుకట్ట వెయ్యక పోతే మహిళకు రక్షణ ఉండదన్నారు. పోలీసులు ఇకనైనా స్పందించి తెలుగు మహిళలపై అసభ్యర పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని చక్రాల ఉష హెచ్చరించారు.

మాతమ్మకు సారె సమర్పించిన పులివర్తి సుధారెడ్డి

విశాలాంధ్ర - రామచంద్రాపురం: మండలంలోని శాఖమూరి కండ్రిగ ఆది ఆంధ్రవాడలో వెలసిన మాతమ్మ తిరునాళ్ళు మంగళవారం ప్రారంభ మైంది సోమవారం రాత్రి తో ముగుస్తుంది దీనిని పురస్కరించుకుని బుధ వారం చిత్తూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి పులివర్తినాని సతీమణి పులివర్తి సుధారెడ్డి మాతమ్మతల్లికి సారె సమర్పించారు ముందుగా గ్రామానికి చేరుకున్న ఆమెకు స్థానిక మండల తెలుగు దేశం దేశం నాయకులు ఆధ్వర్యంలో మేళతాళాలతో మంగల వాయిద్యాలు నడుమ ఘనంగా స్వాగతం పలికారు అనంతరం సుధారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ నిర్వాహకులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదం అందజేసారు ఈకార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిబాబు, జనార్దన్‌చౌదరి, ఉమాపతి నాయుడు, చినబాబు,మురళి నాయుడు, మధుసూదన్‌రెడ్డి, జయ చంద్రనాయుడు,కొట్టేధనుంజయ రెడ్డి,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా



ఏపీ దేవాంగ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా బొప్పాన తిలక్ బాబు ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి విద్యుత్ మరియు భూగర్భ శాఖ మంత్రి పెద్ద రెడ్డి రామచంద్ర రెడ్డి, స్థానిక సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆది మూలం ఆశీస్సులతో ఏపీ దేవాంగ సంక్షేమఅభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా బొప్పాన తిలక్ బాబు ప్రమాణస్వీకారం సమాజం లోని అన్ని వర్గాల ప్రగతికి నా వంతు కృషి చేస్తాను అని బొప్పన తిలక్‌బాబు చెప్పారు. చేనేత నాయకురాలు,వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఐన ఎమ్మెల్సీ పోతుల సునీత, ఏపీ దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్రబాబు సమక్షంలో బీసీ ఎండి చిన్న బాబు, ప్రభుత్వ అధికారి ప్రవీణ్ ల ఆధ్వర్యంలో డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన బొప్పన తిలక్ బాబు విజయవాడలోని గొల్లపూడిలో బీసీ సంక్షేమబోర్డు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ పోతుల సునీత ఆధ్వర్యంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ అభివృద్ధి బోర్డు చైర్మెన్ బీరక సురేంద్ర అధ్యక్షతన జరిగిన ఏపీ దేవాంగ కార్పొరేషన్ పాలకవర్గ సమావేశంలో నూతన డైరెక్టర్‌గా ఎంపికైన బొప్పన తిలక్ బాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య నాయకులు, పాలకవర్గ సభ్యులు, శ్రేయోభిలాషులు తిలక్‌బాబును అభినందించారు.కార్యక్రమంలో రాష్ట్ర పది మంది డైరెక్టర్ లతో పాటు పెడన మున్సిపల్ కార్పొరేషన్ నాగ కుమారి-ప్రసాద్ దంప తులు,అల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నాయకులు గుత్తి త్యాగరాజు,సౌత్ ఇండియా దేవాంగ సమాఖ్య నాయకులు మెట్ల దుర్గ నాగేశ్వరరావు(పెడన), విజయవాడ దేవాంగ సంఘ ప్రధాన కార్యదర్శి మహేష్ బృందం,వరదయ్యపాలెం జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు,వైసీపీ సత్యవేడు నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్ రెడ్డి సీఎల్ఎన్.పల్లి సర్పంచ్ దుద్దు వేణు,వక్ఫ్‌బోర్డుజిల్లాడైరెక్టర్‌అబ్దుల్,మాజీఎంపీటీసీమోహన్‌రావు,పి.వి.రమేష్,బాబు,ఉమ్మిటి రవి, భాస్కర్, ఉదయ్, డప్పు కలకారు ల సంగం అధ్యక్షులు వెంకట కృష్ణయ్య, కొంపల ఈశ్వర్,రాష్ట్ర నలుమూలల నుండి పలువురు పాల్గొన్నారు.

లింగ సమానత్వం పై శిక్షణ

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శ్రీ సిటీ-మోండలేజ్ (ప్రముఖ చాక్లెట్ తయారీ కంపెనీ) మరియు సేవ్ ద చిల్డ్రన్ సంయుక్తంగా బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు మాధవి, డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య-సంక్షేమ కేంద్రం ఆరోగ్య కార్యకర్తలకు లింగ సమానత్వం మరియు ఆరోగ్య సంక్షేమ కార్యకర్తల పాత్ర మరియు బాధ్యత అనే అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డి.యమ్.హెచ్.ఓ డాక్టర్ వికాస్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ మోండలేజ్ (ప్రముఖ చాక్లెట్ తయారీ కంపెనీ) మరియు సేవ్ ద చిల్డ్రన్ వాళ్ళు అందిస్తున్న సహకారం చాలా అభినందనీయమని, వాటిని మనం ఉపయోగించుకుని ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండి, మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే మన లక్ష్యం అన్నారు,ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ వెంకటేష్,సూపెర్వైసర్లు,ఎం.ఎల్.హెచ్.పి లు ,ఏ.ఎన్.ఎం లు, ఆశా కార్యకర్తలు , ఇతర ఆరోగ్య కేంద్ర సిబ్బంది,మోండలేజ్-సేవ్ ది చిల్డ్రన్ హెచ్.ఎస్.ఎస్. ప్రాజెక్ట్ అసిస్టెంట్ మేనేజర్ బాలాజీ, కోఆర్డినేటర్ హేమంత్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపలో చెవిరెడ్డి లక్ష్మీకి హారతులు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ గడప గడపలో ఆత్మీయంగా పలుకరించారు.మంగళం పంచాయతీ బీటీఆర్ పురం, మంగళం క్వార్టర్స్, మోడల్ కాలనీ, ఆర్‌ఆర్ నగర్, అన్నమయ్యనగర్ ప్రాంతాల్లో గడపగడపకు ఆత్మీయ పలుకరింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చేసిన మేలు చెబుతూ.. చేయాల్సిన పనుల గురించి తెలుసుకుంటూ.. ప్రతి గడపలో సమస్యలు తెలుసుకుంటున్న చెవిరెడ్డి లక్ష్మీకి అడుగడుగునా హారతులు పట్టి ఆహ్వానం పలుకుతున్నారు. చెవిరెడ్డి కుటుంబానికి తోడుగా నిలిచి తమ విశ్వాసాన్ని చాటుకుంటామని స్పష్టం చేశారు.

చిత్రలేఖనం"పోటీల పోస్టర్ ఆవిష్కరణ"

విశాలాంధ్ర - తిరుపతి : వేమనవిజ్ఞానకేంద్రం తిరుపతి నందు ప్రారంభం సందర్భంగా వేమనపద్యాలలోని భావాన్ని వ్యక్తీకరించేలా చిత్రాలు వేయించాలని, 6,7,8తరగతులు ఒకటి,9,10,ఇంటర్ రెండవ కేటగిరిగా,డిగ్రీ ఆపై తరగతులు 3వ కేటగిరిగా ఆన్లైన్ పోటీలు జరుగును.ప్రతి కేటగిరిలో 1,2,3 బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వబడతాయి.విద్యార్థులు వేసిన చిత్రాలు ఆన్లైన్లో ఐ మెయిల్ కు చేరాల్సిన చివరి తేది 15-08-2023.మొదటి,రెండవ కెటగిరి విజేతలకు వరుసగా 3,000/-,2,000/-,1000/-బహుమతి,మూడవ కేటగిరికి 4,000/-,3,000/-,2,000/-నగదు బహుమతి తో పాటు మెమెంటో,సర్టిఫికెట్ ఇవ్వబడును.పాల్గొన్నవారందరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇవ్వబడును.చిత్రాలు వేయించిన తర్వాత బాగున్న చిత్రాలన్నింటిని ప్రారంభం రోజు గ్యాలరీ ఏర్పాటు చేయడం జరుగుతుంది.పిల్లలు వేసిన చిత్రాలలో ఉత్తమమయిన చిత్రాలతో ఆల్బమ్ తీసుకరావడం జరుగుతుంది.ప్రభుత్వ,ప్రయివేట్ స్కూల్స్,కాలేజీల హెడ్మాస్టర్లు,ప్రిన్సిపాళ్ల ప్రత్యేకంగా విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున,శ్రీకళాక్షేత్ర కార్యదర్శి సాగర్,నిర్వాహకులు దామోదరం,రెడ్డెప్ప, నారాయణ, గురునాథం, రమణ, మునిరామయ్య,ముఖేష్,బాలక్రిష్ణ,ఆనంద్,ద్వారకానాద్,లావణ్య,వాగ్దేవి,దివ్య పాల్గొన్నారు.

పాత నేరస్థుడు అరెస్ట్

55 వేల నగదు, 8 గ్రాముల బంగారం, రెండు బైకులు స్వాధీనం

విశాలాంధ్ర - చంద్రగిరి: తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలు తో ఆలయాల్లో చోరీలు, మహిళల మెడలో బంగారు ఆభరణాలు, ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న బైకులను దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తిని రంగంపేట క్రాస్ వద్ద ఎస్ఐ వంశీధర్ తమసిబ్బందితో కలిసిఅరెస్ట్ చేశారు. బుధవారం మీడియా సమావే శంలో సిఐ రాజశేఖర్, ఎస్ఐ వంశీధర్ వివరాలు వెల్లడించారు. పెనుమూ రుకు చెందిన వెంకటేష్ చిన్నతనం నుంచి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. జువైనల్ హెూం నుంచి వచ్చిన తర్వాత కూడా తన ప్రవర్తనలో మార్పు రాలేద న్నారు. ఐతేపల్లి గ్రామంలోని ఓ దేవాలయంలో చోరీ, మరో ప్రాంతంలో చైన్ స్నాచి ంగ్, రెండు చోట్ల రెండు బైకులు దొంగతనం చేసినట్లు గుర్తించామన్నారు. నిందితు డు వెంకటేష్ నుండి 55 వేల రూపాయల నగదు, 8 గ్రాముల బంగారం, రెండు బైకులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న మరొక వ్యక్తి కోసం గాలిస్తున్నామని తొందరలో పట్టుకొంటామని తెలిపారు. ప్రజలు గట్టి లాకింగ్ సిస్టం ఉపయోగించి తమ ఇండ్ల ముందర వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని అలాగే తిరుపతి ఎస్పీపరమేశ్వర్‌రెడ్డి డిజైన్ చేసిన ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ఉపయోగించి తమ సొత్తుకు భద్రత కల్పించుకోవాలి సూచించారు.

శ్రీసిటీని సందర్శించిన ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

విశాలాంధ్ర- సత్యవేడు: ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీఎస్పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావ్ బుధవారం శ్రీసిటీనిసందర్శించారు. పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఆయన పరిశ్రమల విద్యుత్ వినియోగంపై సమీక్ష చేశారు. పరిశ్రమలప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన విద్యుత్ అంతరాయం, వోల్టేజ్ సమస్యలు, పెరిగిన విద్యుత్ మరియు ట్రూ అప్ చార్జీలు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి సంబంధిత సమస్యలపై చర్చించారు. చర్చకు వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పరిశ్రమల లోపల తరచుగా విద్యుత్ వ్యవస్థల నిర్వ హణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తద్వారా ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఉత్పన్నం కాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. టెక్నికల్ విభాగానికి చెందిన విద్యుత్ అధికారులు మాట్లాడుతూ పరిశ్రమలు ఉప యోగించే విద్యుత్ వ్యవస్థలు, విధానాలలో తలెత్తే కొన్నిలో పాలను వివరించడంతో పాటు చేయాల్సిన చేయకూడని పనులను సూచించారు.ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు సీఎండీకి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు విని, వాటి పరిష్కారం కోసం ఆయన చూపుతున్న ఆసక్తి, సులభతర వ్యాపారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోందన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ తీసుకుంటున్న వినూత్న చర్యలు తప్పక సత్ఫలితాలు ఇస్తాయన్నారు. ఫలితంగా పరిశ్రమలకు నిరంతరాయ మెరుగైన విద్యుత్ సరఫరా లభిస్తుందన్నారు. విద్యుత్ అంతరా యాలు మరియు ప్రమాదాలను నివారించడానికి, పవర్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియలో సరైన కాంట్రాక్టర్లు, నాణ్యమైన పరికరాలను ఎంపిక చేసుకోవాలని పరిశ్రమ వర్గా లకు ఆయన పిలుపునిచ్చారు. శ్రీసిటీలో మరింత మెరుగైన విద్యుత్ వ్యవస్థను నెలకొల్పే చర్యల్లో భాగంగా పలు సూచనలతో కూడిన వినతిపత్రాన్ని సీఎండీకి శ్రీసిటీ విద్యుత్ విభాగం అందచేసింది.సీఎండీతో పాటు సీజీఎం (ఫైనాన్స్) ధర్మజ్ఞాని, సీజీఎం (ఆపరేషన్స్) గురవయ్య, తిరుపతి సూప రింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీసిటీ విద్యుత్ విభాగం హెడ్ డిఎన్ రెడ్డి సమావేశ సమన్వ యకర్తగా వ్యవహరించారు.ఈ కార్యక్రమం అనంతరం విద్యుత్‌శాఖఅధికారులతో సీఎండీ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం

-ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి భరోసా ఇచ్చారు. అర్హత ఉండి లైసెన్స్ లేక పోలీస్ శాఖతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీఎంఎస్ఆర్ ఆటో యూనియన్ కు చెందిన 60మందికి ఎమ్మెల్యే బియ్యపుమధు తన సొంత సొమ్ముతో లైసెన్సు మంజూరు చేయించివారికి బుధవారం పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి వైసీపీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు లైసెన్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ... శ్రీకాళహస్తిలో ఎంతో మంది ప్రజా ప్రతిని ధులు మారినా ఆటో కార్మికులకు అండగా నిలిచింది మాత్రం జగనన్న ప్రభుత్వం మాత్రమే అన్నారు. అలాగే ఆటో కార్మికుల బాధలను అర్థం చేసుకొని తన సొంత డబ్బు ద్వారా ఉచితంగా లైసెన్స్ అందజేసిన ఎమ్మెల్యే బియ్యపు మధుకు ఆజన్మాంతం రుణపడి ఉంటామన్నారు. క లైసెన్స్ తీసుకోవాలంటే సుమారు రూ.2వేలు ఖర్చవుతోందని...ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే అందజేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి మాట్లా డుతూ... శ్రీకాళహస్తి ఆటో కార్మికులకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. కరోనా కష్టకాలంలో కూడా ఆటో సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆటో వారికి ఏ కష్టం వచ్చినా నేరుగా తనకు తెలియ జేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ మద్దెల గురుమూర్తి, బ్రిటీషు డిప్యూటీ హై కమిషనర్ గరెత్ విన్ ఓవెన్, నియోజకవర్గ పరిశీలకులు ఓడూరగిరిధర్‌రెడ్డి, బి.ఎం. ఎస్. ఆర్ ఆటో యూనియన్ అధ్యక్షులుసురేష్,ఖాదర్ బాషా, జుంలేషా, కన్నయ్య, శ్రీనివాస్, మోహన్, శ్రీనివాసరావు, ఫారుక్, శేఖర్, షాజహాన్, గోపి, వెంకటేష్, శంకర్ రెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

"మోహన్మంత్ర" - 2023" లోగో ఆవిష్కరణ

విశాలాంధ్ర - చంద్రగిరి: ఎంబియు లో జరిగే మోహన్ మంత్ర లోగో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఎంబియు దాసరి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా 19.7.23 తేది(ఎంబియు)లోని దాసరి అడి కల్చర్ట్ పోస్టర్స్ ఒక్నికల్ పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది. అక్టోబర్ 19,20,21 తేదీలలో జరిగే మెహన్ మంత్ర 2023 జాతీయ స్థాయిలో నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చెయ్యాలని ఎంబియు ప్రొచాన్స్ లర్ విష్ణు మంచు నిర్ణయించారు. దాదాపు 30,000 మందికిపైగా విద్యార్థులు పాల్గొంటారని ఎంబియు వైస్ ఛాన్సలర్ ఆచార్య నాగరాజు రామారావు తెలిపారు. ఈ మోహన్ మంత్ర 2023 లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో ఎం బి యు వైస్ ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ ఆచార్య సారథి, డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ బి. రవి శేఖర్, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్,డీన్ అర్ప్ త్ బసిక్, మోహన్ మంత్ర అడ్వైజర్ ఆచార్య రవిచంద్ నిర్వాహకులు విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీకి బ్యాటరీ వాహనం విరాళం

విశాలాంధ్ర - తిరుపతి : హైదరాబాద్ కు చెందిన డాక్టర్ బాల భాస్కర్ రెడ్డి బుధవారం టీటీడీకి రూ.4.5 లక్షల విలువైన బ్యాటరీతో నడిచే వాహనాన్ని (బగ్గీ) విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ఎదుట పూజలు నిర్వహించిన అనంతరం తిరుమల డిఐ శ్రీ జానకిరామిరెడ్డికిదాత బ్యాటరీ వాహనం అందజేశారు.

ముక్కంటీశ్వరుని సేవలో బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనరు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వెలసిన వాయులింగేశ్వరస్వామిని బుధవారం బ్రిటీష్ డిప్యూటీ హై కమి షనరు గరెత్ విన్ ఓవెన్ తన బృందంతో కలసి దర్శించు కున్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి వీరికి దక్షిణ గోపురం వద్ద ఆలయ సాంప్రదాయాలతో ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిది . లో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా కలంకారీ కండువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్టెంట్ వరుణ్ మాలి, పొలిటికల్ ఎకనామి అడ్వైజర్ నళిని రఘురామన్, ఓడూరు గిరిధర్ రెడ్డి, ఆకర్షరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు సాధన మున్నా రాయల్, జయశ్యామ్ రాయల్, వైసీపీ నేత నంద, మునిరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీఎంవీ కండ్రిగలో జగనన్న సురక్ష విజయవంతం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండల పరిధిలోని టీఎంవీ కండ్రిగలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయినట్లు ప్రత్యేక అధికారి, ఎంపీడీవో రఫీఖాన్ తెలిపారు. ఈ గ్రామంలో 481 మంది దరఖాస్తుదారులకి 11 రకాల ధృవీకరణ పత్రాలను ఎటువంటి రుసుము వసూలు చేయకనే ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఆధార్ సేవలు 18 మందికి ఉచితంగా అందించామన్నారు. ఈ కార్యక్రమం లో బీసీ సంఘ నాయకులు వడ్లతాంగళ్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, చుక్కల నిడిగల్లు ఉప సర్పంచ్ ఎల్లయ్య, కన్వీనర్ ప్రవీణ్, పంచాయితీ కార్యదర్శి హేమ శ్రీ, వీఆర్వోవెంకటాచలపతి,సచివాలయసిబ్బంది,వలంటీర్లుపాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో మండలాన్ని ప్రగతి పథంలో నడిపిద్దాం

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రతి పథకం అందేలా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ను సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు సహకరించాలి వరదయ్యపాలెంఎంపిడిఓ కార్యలయంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పద్మప్రియ, ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి పిలుపు మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మండలాన్ని ప్రగతి పథంలో నడిపించేలా భాగస్వాములు కావాలని ఎంపీపీ పద్మప్రియ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు వరదయ్యపాలెం ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వ సభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా అధికారులు తమతమ శాఖలో జరిగిన ప్రగతి గురించి వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ముగింపు సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రతి పథకం అందేలా ముఖ్యమంత్రి జగనన్న నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకంను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అందరూ సహకారం అందించాలని కోరారు.కార్యక్రమంలో ఎంపిడిఓ సుబ్రమణ్యం, ఏవో సుహర్ లత, సరస్వతి సిడీపీవో దేవ కుమారి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి,సర్పంచులు శ్రీధర్ రెడ్డి దీపా నరేంద్ర, వైస్ ఎంపీపీ శ్యామలాదేవి,రాచర్ల ఎంపిటిసి సభ్యులు సామర్ల భువనేశ్వరి హరి,అర్ డబ్లుయు దేవిక వైద్యాధికారి ఉదయ్ కుమార్ ఉపాధి భాస్కర్ సర్పంచులు ఎంపీటీసీ లు పాల్గొన్నారు.

మాటలు వద్దు... చేతలు కావాలి : ఎఐటియూసి

మరోసారి మాట తప్పిన అధికారులు, సర్పంచ్ - విధులను బహిష్కరించిన పంచాయతీ కార్మికులు

విశాలాంధ్ర - రేణిగుంట : రేణిగుంట గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు చెలిస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన అధికారులు మరియు సర్పంచ్ ల తీరుకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ రేణిగుంట గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు అందడం లేదని, కావున ఈనెల 5 వ తేదీన కార్మికులు విధులకు పోకుండా ఆందోళన కార్యక్రమం చేపట్టగా స్థానిక సర్పంచ్ నగేశం మరియు డీ ఎల్ పి ఓ చర్చలు జరిపి ఈనెల 10వ తేదీలోపు అందరికీ జీతాలు చెల్లిస్తామని తెలిపారు. అనంతరం విధులకు వెళ్ళమని చెప్పడం జరిగిందని, అధికారుల హామీ మేరకు కార్మికులు విధులకు వెళ్లామని తెలిపారు. హామీ ఇచ్చిన అధికారులు 10 వ తేదీకి జీతాలు చెల్లించలేదని నేడు 18వ తేదీ అవుతున్న పంచాయితీ కార్మికులతో అధికారులు కనీసం చర్చించలేదని అన్నారు. కార్మికులు అడుగుతున్న కూడా కనీస సమాధానం సైతం ఇవ్వడం లేదని, విధిలేని పరిస్థితుల్లో కార్మికులు మరోసారి ఈరోజు ఉదయం ఐదు గంటల నుండి పనులకు వెళ్లకుండా నిరసన కార్యక్రమం చేపట్టారన్నారు. అధికార పార్టీ నాయకులు పవిత్ర రెడ్డి, ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి, స్థానిక నాయకులు వచ్చి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, స్థానిక పంచాయతీ కార్మికుల అధ్యక్ష కార్యదర్శులతోనూ చర్చలు జరిపి రెండు రోజులలో రెండు నెలల జీతం చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. పంచాయతీ కార్మికులు అంగీకరించకపోవడంతో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ కలుగజేసుకొని పంచాయతీ కార్మికులను ఒప్పించడం జరిగింది. అనంతరం పంచాయతీ కార్మికులు విధులకు వెళ్ల డం జరిగిందన్నారు. ఇకనైనా పంచాయతీ కార్మికులకు 18 నెలల పిఎఫ్ ను మరియు ఈఎస్ఐ నగ దును అందరూ కలిసి అమలు చేయాలని లేని పక్షంలో అధికారుల హామీలకు గానీ స్థానిక ప్రజాప్ర తినిధుల హామీలు గానీ అధికార పార్టీ నాయకుల హామీలు గానీ అమలు కాని పక్షంలో విలువ లేకుండా పోతుందన్నారు. అలాంటి పరిస్థితి చెప్పించుకోవద్దని ఆయన అన్నారు లేనిపక్షంలో మరోసారి పెద్ద ఎత్తున సమ్మెకు వెళ్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి. వై ఎస్.మణి, సిపిఐ మండల కార్యదర్శి బి మోహన్ రెడ్డి, నగర అధ్యక్షులు ఏఐటీయూసీ వి.కార్తీక్, రజాక్, సెల్వ, రసూల్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చంద్రకళ, సుబ్బరాజు, శీను, గోవిందమ్మ, రాములమ్మ, రంగమ్మ, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో డయాలసిస్ పేషంట్లకు మందుల విరాళం

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో నెఫ్రోప్లస్ విభాగంలో డయాలసిస్ చేసుకొంటున్న పేషంట్లకు శ్రీ వెంకటేశ్వర ఎ.పి. స్టేట్ కిడ్నీ పేషెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటరామయ్య బుధవారం సాయంత్రం రూ? 20,000/- విలువ గల మందులను విరాళంగా అందించారు .స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి సదాభార్గవి ద్వారా ఈ విరాళం అందించారు.ఎ ఈ సందర్భంగా సదాభార్గవి మాట్లాడుతూ, ఎ.పి స్టేట్ కిడ్నీ పేషంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట రామయ్య, ఎపిఎస్ పిడిసిఎల్ ఈ ఈ మురళీ ధర్ రావు (కర్నూల్),వి.రెడ్డెప్ప(టీటీడీ ఉద్యోగి),టి. మునస్వామి (రిటైర్డ్ యూనివ ర్సిటీ)కలసి 11మంది డయాలసిస్ రోగులకు నెలకు సరిపడే మందులను అందజేసినందుకు అభినందనలు తెలియజేశారు. స్విమ్స్ లో డయాలసిస్ చేసుకుంటున్న పేషెంట్లకు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాణదానం ట్రస్ట్ కండిషనల్ డొనేషన్స్ ద్వారా మందులను ఉచితంగా ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్. శివకుమార్, డాక్టర్. కోటిరెడ్డి, డయాలసిస్ మెడికల్ ఆఫీసర్ డా.ఆర్.డి. నాగరాజు, అసిస్టెంట్‌డైరెక్టర్‌నర్సింగ్‌ప్రభావతి,నెఫ్రోప్లెస్ అసిస్టెంట్ డైరెక్టర్ భాగ్యశ్రీ, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు అండగా ఉంటా

-కలవగుంట భరత్ రెడ్డి

విశాలాంధ్ర-తొట్టంబేడు: ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులకు అండగా ఉంటానని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి చెప్పారు. తొట్టంబేడు మండలం రాంబట్లపల్లె ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఆయన నోటు పుస్తకాలు, కాపీ రైటింగ్ బుక్స్, పలకలు, జామెంట్రీ బాక్సులు, వాటర్ బాటిల్స్, పెన్నులు, పెన్సిల్, ఎరేజర్, షార్ప్ నర్, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలవగుంట భరత్ రెడ్డి మాట్లాడుతూ... పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించాలనే ఆశయంతో తాను ఈ సేవా కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా విద్యార్థులు క్రమశి క్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన కోరుకున్నారు. తాను గత కొన్నేళ్లుగా విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేస్తున్నట్లు ఈ సందర్భంగా భరత్ రెడ్డి గుర్తు చేశారు. కాగా రాంబట్లపల్లెలో ముగ్గురికి సామాజిక భద్రతా పింఛను రాకపోవడంతో ఆయన సొంత డబ్బుతో వారికి పింఛను అందజేశారు. అదేవిధంగా ఇటీవల గ్రామంలో వివాహాలు, గృహప్రవేశాలు చేసు కున్న వారికి ఇంటికి వెళ్లి బహుమతులు అందజేయడంతో పాటు వారికి శుభాకాంక్షలు తెలియ జేశా రు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరి, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర కోఆ ర్డినేటర్ బాలాజీ రెడ్డి, వైస్ సర్పంచ్ హరి, రామ్, లక్ష్మణ్, గోపి, రాజా, రాజు, శరత్, శ్రీను, భరత్, తరుణ్, నాగరాజు, మోహన్, కిష్టయ్య, నితీష్, శంకరయ్య, గుణ, శివ, వెంకటేష్, సుబ్బు, కిషోర్, రాము, భాస్కర్, ప్రతాప్, పవన్, భాను, మహేష్, రాజేష్, పోలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదరాలికి న్యాయం చేయండి : సీపీఐ

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండలం పూడి గిరిజనకాలనీలో నిరుపేద రాలైన రాము లమ్మకు న్యాయం చేయాలని సీపీఐ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు బుధవారం పూడి పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నేతలు మాట్లాడుతూ... పూడి గిరిజన కాలనీలో వెంకటకృష్ణయ్య భార్య రాములమ్మ తన భర్త మరణించడంతో తన కుమారునితో కలసి బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిందన్నారు. ఇతర ప్రాంతాలకు పోయేటప్పుడు ఇంటికి తాళం వేసిందన్నారు. అయితే రాములమ్మ తోడు కోడలు అయిన వెంకటమ్మ ఇంటి తాళాలను పగలగొట్టి స్వాధీనం చేసకుందన్నారు. ఇంటిని ఖాళీ చేయమని అడిగితే దాడికి యత్నిస్తోందన్నారు. అంతేగాకుండా రాములమ్మకు ఉన్న ఆస్థిని కూడా కబ్జా చేయడానికి యత్నిస్తోందన్నారు. అధికారులు స్పందించి వెంకటమ్మ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రుద్రపాక శ్రీనివాసులు, ఎం.శివకుమార్, కె.శివకుమార్, వెంకయ్య, రాజేశ్వరి, వరలక్ష్మి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లోన్లు మంజూరు చేసేదాకా కదలం

డ్వాక్రా లోన్లు పూర్తిగా కట్టినా తిరిగి రుణాలు ఇవ్వరా...?

విశాలాంధ్ర -వరదయ్యపాలెం: వెలుగు కార్యాలయం ముందు డ్వాక్రా మహిళలు మెరుపు ధర్నాలి డ్వాక్రా రుణాల విషయంలో గత కొన్ని నెలల క్రితం కొంతమంది సంఘ మిత్రలు, ఏపిఎం సహకారంతో దొంగ లోన్లు పెట్టి లక్షలాది రూపాయలు అవకతవకలు వెలుగులోకి వచ్చిన విషయం విధితవేఇందుకు సంబంధించి సిఎల్ఎన్ పల్లి చెందిన డ్వాక్రా గ్రూపు మహిళలు ఎప్పటిలాగే లోన్లు తీసుకొని పూర్తిగా కట్టినప్పటికీ వారిలో కొంత మంది పేరుమీద మీద వేరే బ్యాంకుల్లో వేరే గ్రూపుల్లో లోన్లు ఉన్నాయని వెలుగు కార్యాలయ అధికారులు ఎన్ఓసి ఇస్తే తప్ప కొత్త లోన్లు ఇవ్వలేమని బ్యాంక్ అధికారులు తేల్చి చెప్పడంతో... కొన్ని నెలలుగా వెలుగు కార్యా లయం చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారి గత రెండు రోజులుగా టీడీపీ మరియు సిపిఐ పార్టీల సహకారంతో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా నిన్న ఎంపీడీవో కార్యాలయం వద్ద వంటావార్పుతో తమ నిరసన తెలియజేయగా,ఈరోజు వెలుగు కార్యాలయంలో ఉన్న సిబ్బందని బయటికి పంపించేసి తమకు లోన్లు ఇచ్చేదాకా ఇక్కడి నుంచి కదలబోమంటూ మెరుపు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ మాట్లాడుతూ పేద మహిళల కడుపు కొట్టి కొంతమంది సంఘమిత్రలు ఏపీఎం సహకారంతో దొంగలోన్లు పెట్టుకొని లక్షల రూపాయలు చేతి వాటం చూపించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, రెగ్యులర్గా లోన్లు తీసుకొని పూర్తిగా కట్టిన గ్రూపులకు తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని, అలా ఇవ్వని పక్షంలో ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం అని హెచ్చరించారు. సమా చారం అందుకున్న స్థానిక పోలీసులు వెలుగు సిసి యశోదతో మాట్లాడటం జరిగింది. సమస్యను తనపైన ఉన్న ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేశామని బ్యాంకులకు సంబంధించిన సెంట్రల్ టీం తో మాట్లాడి రెగ్యులర్ గా కడుతున్న గ్రూపులకు యధావిధిగా లోన్లు ఇప్పించే ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారని చెప్పడంతో డ్వాక్రా మహిళలు నిరసనను విరమించారు. అయితే తమకు కొత్త లోన్ల వచ్చేంత వరకు రోజు వెలుగు కార్యాలయం వద్ద తమ నిరసన తెలియజేస్తామని డ్వాక్రా మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, తెలుగుదేశం పార్టీ నాయకులు సురేష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.